బీఆర్ఎస్ అధినేత కే చంద్రశేఖర్‌రావు రోడ్‌షోలకు సిద్ధమైన బస్సు

పోరుబాట రూటు ఖరారు

మొదటిపేజీ తరువాయి...

విశేషం. ఉద్యమ సమయంలో రాష్ట్రమంతా రోడ్‌షోలు నిర్వహించి ప్రజాచైతన్యాన్ని కూడగట్టినట్టే ఈ పార్లమెంట్ ఎన్నికల సమయంలోనూ కేసీఆర్ సమీకరించేలా ముమ్మర ఏర్పాట్లు చేయనున్నారు. ఒక్క సిద్దిపేటలో బహిరంగసభ మినహా మిగితా అన్ని ప్రాంతాల్లోనూ కేసీఆర్ రోడ్‌షో నిర్వహించనున్నారు.

దగ్గరకానున్న దూరాలు

పదేండ్లపాటు అధికారంలో ఉండటం వల్ల పార్టీ అధినేతను కలుసుకోలేకపోయామనే పార్టీ శ్రేణులకు, ఉద్యమ సమయంలో అనేక సందర్భాల్లో తనతో కలిసి నడిచిన ఉద్యమసహచరులు, మేధావులతో కేసీఆర్ కరచాలనం చేసేలా ఆయన షెడ్యూల్ రూపొందించారని పార్టీ వర్గాలు చెప్పాయి. అందులో భాగంగానే కేసీఆర్ బస్సుయాత్ర ద్వారా ఆ రోజు రోడ్‌షో ముగిసిన అనంతరం అదే పట్టణంలో బసచేసి, ఆ మరుసటి రోజు అందరినీ కలవటమే కాకుండా పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేసే విధంగా ఆయన షెడ్యూల్‌ను రూపొందించడం విశేషం. తద్వారా ఇటు పార్టీ శ్రేణుల్లో, సమాజంలోని వివిధ వర్గాల్లో 'కేసీఆర్ మాకు దూరం అయ్యారు' అనే అపోహను పోగొట్టి అన్ని వర్గాలకు దగ్గర కానుండటం మరో విశేషం. పార్టీ అధినేత కేసీఆర్ నిర్వహించే రోడ్‌షోల కోసం బస్సు, రోడ్‌షో వాహనాలు సిద్ధం అయ్యాయి.

సీఈవోకు బీఆర్ఎస్ వినతి

బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు కే చంద్రశేఖర్‌రావు చేపట్టనున్న బస్సుయాత్రకు అన్ని రకాల అనుమతులు ఇవ్వాలని బీఆర్ఎస్ ప్రతినిధి బృందం సీఈవో వికాస్‌రాజ్‌కు విజ్ఞప్తి చేసింది. శనివారం బీఆర్‌కేఆర్ భవన్‌లో సీఈవోను ఎమ్మెల్యే కేపీ వివేకానంద, ఎమ్మెల్సీ ఎల్ రమణ, టీఆర్ఎస్ఎల్పీ కార్యాలయ కార్యదర్శి రమేశ్‌రెడ్డి వినతిపత్రం సమర్పించారు.

కేసీఆర్ రోడ్‌షో షెడ్యూల్

ఏప్రిల్ 24	మిర్యాలగూడ, సూర్యాపేట (సూర్యాపేటలోనే బస)
ఏప్రిల్ 25	భువనగిరి రోడ్‌షో (ఆర్రవల్లిలో బస)
ఏప్రిల్ 26	మహబూబ్‌నగర్ (అక్కడే బస)
ఏప్రిల్ 27	నాగర్‌కర్నూల్
ఏప్రిల్ 28	వరంగల్ రోడ్‌షో (వరంగల్‌లోనే బస)
ఏప్రిల్ 29	ఖమ్మం రోడ్‌షో (అక్కడే బస)
ఏప్రిల్ 30	తల్లాడ, కొత్తగూడెం (కొత్తగూడెంలో బస)
మే 1	మహబూబాబాద్ (వరంగల్‌లో బస)
మే 2	జమ్మికుంట (వీణవంకలో బస)
మే 3	రామగుండం (అక్కడే బస)
మే 4	మంచిర్యాల (కరీంనగర్‌లో బస)
మే 5	జగిత్యాల (అక్కడే బస)
మే 6	నిజామాబాద్ (అక్కడే బస)
మే 7	కామారెడ్డి, మెదక్ (మెదక్‌లో బస)
మే 8	నర్సాపూర్, పటాన్‌చెరు (ఎర్రవెల్లిలో బస)
మే 9	కరీంనగర్ (అక్కడే బస)
మే 10	సిరిసిల్ల, సిద్దిపేట బహిరంగ సభ (హైదరాబాద్‌లో బస)

మల్లన్నసాగర్ కట్టింది రాష్ట్రం కోసమే

మొదటిపేజీ తరువాయి...

అని ప్రశ్నించారు. సిద్దిపేట జిల్లా గజ్వేల్ మున్సిపల్ పరిధిలోని ఫంక్షన్‌హాల్‌లో శనివారం నిర్వహించిన గజ్వేల్ నియోజకవర్గ బీఆర్ఎస్ ముఖ్యకార్యకర్తల సమావేశంలో హరీశ్‌రావు పాల్గొన్నారు. అనంతరం గజ్వేల్ మండలం ప్రజ్ఞాపూర్‌లో బీఆర్ఎస్ మెదక్ ఎంపీ అభ్యర్థి వెంకట్రామిరెడ్డి, ఎమ్మెల్సీ యాదవరెడ్డి, ఎఫ్‌డీసీ మాజీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి, నాయకులు వేలేటి రాధాకృష్ణశర్మ, లక్కిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి తదితరులతో హరీశ్‌రావు మీడియాతో మాట్లాడారు. 'లక్షలాది ఎకరాలకు సాగునీళ్లు అందించడంలో మెదక్ బీఆర్ఎస్ అభ్యర్థి వెంకట్రామిరెడ్డి కృషి ఎంతో ఉన్నది. కేసీఆర్ పట్టుదలతో కట్టించిన మల్లన్నసాగర్ నుంచే మీరు నేడు ఆగమేఘాల మీద హైదరాబాద్‌కు పైప్‌లైన్ వేస్తున్నారు. హైదరాబాద్ తాగునీటి కోసం మరి మల్లన్నసాగర్ నీళ్లు ఎందుకు తీసుకుపోతున్నరు? దేశంలోనే బెస్ట్ ఆర్‌అండ్‌ఆర్ కాలనీని కట్టించింది వెంకట్రామిరెడ్డే. దేశంలోనే ఉత్తమ ప్యాకేజీ ఇచ్చాం. కాంగ్రెస్ హయాంలో కట్టిన పులిచింతల ప్రాజెక్టు నిర్మాణంలో సగమే ఇచ్చారు. లక్షల మందికి తాగు, సాగునీరు అందించి కొత్త వెలుగులు నింపాం. నష్టం వందమందికి జరిగితే లక్షలాది మందికి లాభం చేకూరుతున్నది. ఎక్కడ నుంచి వచ్చి ఇక్కడ నుంచి పోటీ చేస్తున్నావ్.. అని వెంకట్రామిరెడ్డిని అంటున్నావు, మరి మల్కాజిగిరిలో ఎంపీగా నువ్వు పోటీ చేయలేదా? ఉత్తరప్రదేశ్‌లో ప్రజలు ఓడిస్తే రాహుల్‌గాంధీ కేరళలోని వయనాడుకు వెళ్లి పోటీ చేయలేదా? అని నిప్పులు చెరిగారు.

పదవి కోసం తొక్కడం రేవంత్‌కు అలవాటే

పదవి కోసం అందర్నీ తొక్కుకుంటూ రావడం రేవంత్‌రెడ్డికి అలవాటేనని హరీశ్‌రావు విమర్శించారు. అందర్నీ తొక్కుకుంటూ ఈ స్థాయికి వచ్చిన అంటున్న రేవంత్‌రెడ్డి.. పదవి కోసం ఎవర్నీ అయినా తొక్కుతాడని మండిపడ్డారు. రాచరిక పాలన అని మమ్మల్ని విమర్శిస్తున్న రేవంత్.. ఆయన ఎన్నడు ప్రజలను కలిశారని నిలదీశారు. మీ పార్టీ నేతలు వీహెచ్, మోత్కుపల్లికి అపాయింట్‌మెంట్ ఇవ్వలేదని వాళ్లే మీడియాకు చెప్పారని గుర్తుచేశారు. 'మీ నాయకులనే కలువని నువ్వు.. మమ్మల్ని విమర్శించే నైతిక హక్కు ఎక్కడిది?' అని రేవంత్‌రెడ్డిని నిలదీశారు. ఆరోగ్యం బాగాలేకపోయినా ఎర్రటి ఎండలో కేసీఆర్ రైతులను పరామర్శిస్తే.. సాయంత్ర వేళ హాయిగా క్రికెట్ చూస్తూ ఎంజాయ్ చేసింది నువ్వు కాదా? అని రేవంత్‌రెడ్డిని విమర్శించారు.

ఇందిరాగాంధీ మెదక్‌కు ఏం చేశారు?

సీఎం రేవంత్‌రెడ్డి మెదక్‌లో మరోసారి తన మూర్కత్వాన్ని చాటుకున్నారని, ఇచ్చిన హామీలపై ప్రజలు నిలదీస్తే సమాధానం చెప్పలేక అసహనంతో మాట్లాడుతున్నారని మండిపడ్డారు. ప్రతిపక్షంలో ఉండగా రాష్ట్రంలో అభివృద్ధి గజ్వేల్, మెదక్ జిల్లాలో మాత్రమే జరిగిందని చెప్పి, ఇప్పుడు ఇంకా అభివృద్ధి కాలేదని తప్పుడు ప్రచారం చేస్తున్నాడని సీఎంపై మండిపడ్డారు. ఇందిరాగాంధీ మెదక్‌కు ఏం చేశారు? మెదక్‌లో కొత్త జిల్లాలు ఏర్పాటు చేశారా? రైల్వేలైన్ తెచ్చారా? అని నిలదీశారు. ఇవన్నీ తెచ్చింది కేసీఆర్ అని చెప్పారు. మల్లన్నసాగర్, కొండపోచమ్మ సాగర్ వంటి ఇరిగేషన్ ప్రాజెక్టులు నిర్మించి లక్షల ఎకరాలకు నీళ్లు ఇచ్చింది కేసీఆర్ అని పేర్కొన్నారు. జిల్లాకు మూడు వర్సిటీలు కేసీఆర్ తెచ్చారని వివరించారు. 'మెదక్ జిల్లాలో ఏం అభివృద్ధి జరిగిందో కండ్లు పెద్దవి చేసి చూడు రేవంత్.. లేకపోతే నువ్వొస్తే నేను చూపిస్తా' అని చెప్పారు. మెదక్, సిద్దిపేట జిల్లాలను రద్దు చేస్తా అంటున్న నువ్వు ఈ రోజు మా జిల్లా గురించి మాట్లాడుతావా?' అని నిలదీశారు. సింగూరు జలాలు మెదక్ జిల్లాను తాకాయంటే అంటే అది కేసీఆర్ చలవే అని చెప్పారు.

నిద్దిపేట జిల్లా గజ్వేల్ మండలం ప్రజ్ఞాపూర్‌లో శనివారం మీడియాతో మాట్లాడుతున్న మాజీ మంత్రి హరీశ్‌రావు. చిత్రంలో బీఆర్ఎస్ మెదక్ ఎంపీ అభ్యర్థి వెంకట్రామిరెడ్డి, ఎమ్మెల్సీ యాదవరెడ్డి, ఎఫ్‌డీసీ మాజీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి, నాయకులు వేలేటి రాధాకృష్ణశర్మ, లక్కిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి

భూమికి జానెడు..ఆవగింజంత మెదడు లేదు!

'రాజకీయాల్లో విలువలు ఉండాలి. ముఖ్యమంత్రి పదవిపై గౌరవంతో నీ ఎత్తు గురించి మాట్లాడటం లేదు. కానీ, నీకు నీ భాషలోనే మాట్లాడితేనే అర్థం అవుతుంది. మాటిమాటికి దూలమోలే పెరిగావ్ అంటున్నావ్.. భూమికి జానెడు ఉన్న నీకు ఆవగింజంత మెదడు కూడా దేవుడు ఇవ్వలేదు.. అని నేనేనలా? సీఎం పదవిలో ఉండి సిగ్గులేని మాటలు.. మమ్మల్ని విమర్శించినప్పుడు మాకు కూడా విమర్శించే హక్కు ఉంటది. కానీ మాకు విజ్ఞత ఉంది. అందుకే విమర్శించడం లేదు. సీఎం పదవిలో ఉండి, ఆ స్థాయికి తగ్గట్టుగా మాట్లాడటం లేదు. వ్యక్తిగత దూషణలు చేయడం సరికాదు' అని రేవంత్‌కు హితవు పలికారు. పాలన చేతగాక, అడిగిన ప్రశ్నలకు జవాబు చెప్పడం చేతగాక తన బాడీ షేమింగ్‌పై రేవంత్ వ్యాఖ్యలు చేస్తున్నారని హరీశ్‌రావు ఆగ్రహం వ్యక్తంచేశారు.

అబద్ధాలకు ఆస్కార్ అవార్డు ఇస్తే రేవంత్‌కే..

తెలంగాణ తెచ్చిన ఆ మహానేతపై ఇష్టమొచ్చినట్టు మొరగడాన్ని ప్రజలు గమనిస్తున్నారని హరీశ్‌రావు పేర్కొన్నారు. అసెంబ్లీ ఎన్నికలప్పుడు రేవంత్ పిట్టల దొరలా మాట్లాడినట్టే ఇప్పుడూ మాట్లాడి ప్రజలను మభ్యపెట్టొచ్చని అనుకుంటున్నారని తెలిపారు. రేవంత్ మోసాలు ఈ నాలుగున్నర నెలల్లో ప్రజలకు అర్థమయ్యాయని, రేవంత్ ఎన్ని కట్టుకథలు, పిట్టకథలు చెప్పినా ప్రజలు నమ్మే పరిస్థితిలో లేరని హరీశ్‌రావు అన్నారు. అబద్ధాలకు ఆస్కార్ అవార్డు లాంటిది ఎవరైనా ఇస్తే అది కచ్చితంగా రేవంత్‌కే వస్తుందని ఎద్దేవాచేశారు. 'కారును ఇనుప సామాను కింద అమ్మడం కాదు.. నీ కాంగ్రెస్ పార్టీ చెయ్యి చచ్చుబడటం ఖాయం' అని విమర్శించారు.

మాటమీద నిలబడే నైజం ఉందా?

'డిసెంబర్ 9న రూ.2 లక్షల పంట రుణమాఫీ చేస్తానని చెప్పి చేయలేదని, ఇప్పటికీ రుణమాఫీ చేయకుండా రైతులను మోసం చేస్తున్నదని నీవు కాదా?' అని సీఎం రేవంత్‌రెడ్డిపై హరీశ్‌రావు మండిపడ్డారు. రైతులకు ఇచ్చిన ఆరు గ్యారెంటీలు ఇప్పటికీ అమలు చేయలేదని విమర్శించారు. 'కొడంగల్‌లో ఓడిపోతే రాజకీయ సన్యాసం తీసుకుంటా' అని చెప్పావ్.. మాటమీద నిలబడే నైజం నీకు అందా? అని నిలదీశారు. అత్యధిక ఎమ్మెల్యే సీట్లు బీసీలకు ఇచ్చిన పార్టీ బీఆర్ఎస్ అని చెప్పారు. 'బీసీలను, ఎస్సీలను మోసం చేసింది నువ్వు. మైనార్టీల ఓట్లు వేసుకొని గెలిచి మైనార్టీలకు క్యాబినెట్‌లో అవకాశం కల్పించలేదు. మైనార్టీలు క్యాబినెట్‌లో లేకుండా ప్రభుత్వం నడుతున్నది నువ్వే' అని రేవంత్‌పై హరీశ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్రవ్యాప్తంగా రెండు రోజులుగా వడగండ్ల వానలుపడి రైతులు తీవ్రంగా నష్టపోతున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని హరీశ్‌రావు మండిపడ్డారు. రైతులను మంత్రులు ఎవరూ కలవడం లేదని ఆక్షేపించారు. కేంద్రాల్లో రైతుల పోసిన ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు.

లోకం పోకడ



రోజూ ఇన్నిన్ని ఉత్తరాలు మోసుకొచ్చే బాధ నుంచి విముక్తి చేయాలని పోస్టుమ్యాన్ కూడా ఓ ఉత్తరం రాశాడు సార్!

త్వరలోనే రేవంత్ బీజేపీలోకి

మొదటిపేజీ తరువాయి...

ఆయన మనసులో హిందుత్వం బలంగా ఉన్నా ఏమీ చేయలేని స్థితిలో నేడు ఉన్నారని చెప్పారు. బీజేపీతో కొట్లాడుతామని చెప్పి బీజేపీలోకే వస్తున్నారని విమర్శించారు. కానీ, బీజేపీతో అంతో ఇంతో కొట్లాడింది కేసీఆర్ ఒక్కరే అని అర్వింద్ గుర్తు చేశారు. బీఆర్ఎస్ హయాంలో ఎక్కడా ఇబ్బందులు రాకుండా కరెంటు ఇచ్చానని గొప్పగా చెప్పుకొని ఓట్లడిగే హక్కు ఒక్క కేసీఆర్‌కు మాత్రమే ఉన్నదని స్పష్టం చేశారు. అసలు కాంగ్రెస్‌కు ఒక ఎజెండా అంటూ లేదని, ఆ పార్టీకి ఓట్లడిగే నైతిక హక్కు ఏమాత్రం లేదని విమర్శించారు. కాంగ్రెస్ దేశాన్ని విభజించి నాశనం చేసిందని మండిపడ్డారు. ఇప్పుడు ఆర్టికల్ 370 తీసేస్తం, ట్రిపుల్ తలాక్ తెస్తాం అంటున్నారని దుయ్యబట్టారు. సీఏఏను ఎందుకు విమర్శిస్తున్నారో అర్థంకావడం లేదని పేర్కొన్నారు. రాజ్యాంగంలో సెక్యులర్ పదం ఎందుకు పెట్టారో చెప్పాలని, ఈ దేశాన్ని 70 ఏండ్లు పాలించి చేసిందేంటో చెప్పాలని డిమాండ్ చేశారు. ఫోన్ ట్యాపింగ్ అనేది ఒక ప్రైవేటు ఇష్యూ అని, దానిపై ఫోకస్ పెట్టడమేంటి అని ప్రశ్నించారు. నిజామాబాద్ ఎంపీగా జగిత్యాల జీవన్‌రెడ్డి పోటీ చేస్తున్నారని ఇక్కడి ప్రజలు అనుకోవడం లేదని, ఆర్మూరు జీవన్‌రెడ్డి ఎంపీగా పోటీ చేస్తున్నట్టు అనుకుంటున్నారని ఎద్దేవా చేశారు.

రేవంత్.. నీ బాగోతం బయటపెడుతా



మహబూబ్‌నగర్, ఏప్రిల్ 20 (నమస్తే తెలంగాణ ప్రతినిధి) : 'నా బాగోతం చెప్తాడట ఈయన.. దమ్ముంటే రా.. ఏ చౌరస్తా కొస్తావో రా.. నేను కూడా వస్తా.. నీ బాగోతం చెప్తానో.. నా బాగోతం చెప్తావో రా.. రెడీగా ఉన్నా.. నువ్వు మాట్లాడిన పాల మూరులోని తెలంగాణ చౌరస్తాకి వస్తావా?'.. అంటూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి బీజేపీ జాతీయ ఉపాధ్యక్షురాలు, మహబూబ్‌నగర్ ఎంపీ అభ్యర్థి డీకే అరుణ సవాల్ విసిరారు. శనివారం మహబూబ్‌నగర్‌లో మీడియాతో ఆమె సీఎం రేవంత్‌పై ఘాటుగా స్పందించారు. ఒక ఆడదాన్ని అని కూడా చూడకుండా ఆరోపణలు చేస్తావా? అంటూ కడిగిపారేశారు. 'మమ్మల్ని పండబెట్టి తొక్కుతాడంట.. నన్ను పండబెట్టి తొక్కి.. ఆయన పార్లమెంటుకు గెలిపించుకుంటాడంట వాళ్ల అభ్యర్థిని.. ఒక ముఖ్యమంత్రిగా మాట్లాడే మాటలు ఇవేనా? ఎలా తొక్కుతావో రా.. సూసుకుందాం రా.. అంటూ సవాల్ విసిరారు. 'ఒక మహిళ అని చూడకుండా నోటికొచ్చినట్టు దొరసాని.. తొక్కుతా.. అంటూ అహంకార మాటలు మానుకోవాలి. నీ తల్లి, చెల్లి, నీ కూతురిని అడుగు మహిళ అంటే ఏమిటో చెబుతారు' అని మండిపడ్డారు.

పార్టీ పరిస్థితిపై పునరాలోచన అవసరం

- నా కుమారుడే పోటీ నుంచి తప్పుకొన్నాడు
- ఎమ్మెల్సీలపై చట్టబద్ధంగా వ్యవహరిస్తా
- మీడియాతో మండలి చైర్మన్ గుత్తా

నల్లగొండ ప్రతినిధి, ఏప్రిల్ 20 (నమస్తే తెలంగాణ): పార్లమెంట్ ఎన్నికల తర్వాతనైనా బీఆర్ఎస్ పార్టీ పరిస్థితిపై పునరాలోచన అవసరమని, సంస్థాగత నిర్మాణమే ఏ పార్టీ పటిష్టతకైనా పునాది అని శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి అభిప్రాయపడ్డారు. నల్లగొండ జిల్లా చిట్యాల మండలం ఉరుమడ్లలోని తన నివాసంలో ఆయన మీడియాతో మాట్లాడారు. పార్టీ ఫిరాయించిన ఎమ్మెల్సీలపై న్యాయపరంగా, చట్టపరంగా తీసుకోవాల్సిన చర్యల మీద దృష్టి సారించామని తెలిపారు. ఇలాంటి సందర్భాల్లో గతంలో తీసుకున్న నిర్ణయాలను, పూర్తి అంశాలను పరిగణలోకి తీసుకుని తదుపరి చర్యలు చేపడతామని చెప్పారు. తన కుమారుడు అమిత్‌రెడ్డి పార్లమెంట్ ఎన్నికల్లో పోటీ నుంచి స్వచ్ఛందంగా తప్పుకొన్నాడని స్పష్టం చేశారు. కేసీఆర్, మాజీ మంత్రులు కేటీఆర్, హరీశ్‌రావు తన కుమారుడికి టికెట్ ఇస్తామని, పోటీలో ఉండాలని చెప్పిన విషయాన్ని గుర్తుచేశారు.

గుత్తా మాటల్లో సంచలనమేమీ లేదు:జగదీశ్‌రెడ్డి

మీడియా చేస్తున్న ప్రచారమే తప్ప గుత్తా సుఖేందర్ రెడ్డి మాటల్లో పెద్దగా సంచలనాలేవీ లేవని మాజీ మంత్రి, ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డి పేర్కొన్నారు. నార్కట్‌పల్లిలోని ఓ హోటల్‌లో గుత్తా వ్యాఖ్యలపై మీడియా అడిగిన ప్రశ్నకు జగదీశ్‌రెడ్డి స్పందించారు. తనపై గుత్తా వ్యక్తిగతంగా కామెంట్స్ చేసినట్టుగా ఎక్కడా కనపడలేదని, సుఖేందర్ రెడ్డి చాలా సీనియర్ నాయకుడని, అందుకే కేసీఆర్ మండలి చైర్మన్‌గా నియమించనట్టు తాను భావిస్తున్నానని చెప్పారు. ఆయన పార్టీ నిర్మాణంపై చేసిన సూచనలపైనా ఆలోచన చేస్తామని, ఎంపీ ఎన్నికల తర్వాత పార్టీ నిర్మాణం విషయంలో వారి సేవలు వినియోగించుకోవాలని కేసీఆర్ భావిస్తున్నారని, అవసరమైతే సుఖేందర్‌రెడ్డితో మాట్లాడే ప్రయత్నం చేస్తామని చెప్పారు.

జానా, జైపాల్ ఎందులో తక్కువ?

కాంగ్రెస్ ఉద్ధండులంటే అంత చులకనా?

- పదే పదే అవమానించడం ఏం పద్ధతి?
- హీరో అయ్యేందుకే కించపరచాలా?
- సీఎం రేవంత్ వ్యాఖ్యలపై కాంగ్రెస్ పార్టీ నేతల గుస్సా
- ఇప్పటికైనా పంథా మార్చుకోవాలని హితవు

హైదరాబాద్, ఏప్రిల్ 20 (నమస్తే తెలంగాణ): 'నేను జానారెడ్డి లాంటి వాడినో, జైపాల్‌రెడ్డి లాంటి వాడినో కాదు' అంటూ సీఎం రేవంత్‌రెడ్డి పదే పదే చేస్తున్న వ్యాఖ్యలపై కాంగ్రెస్ సీనియర్ నేతలతో పాటు జానారెడ్డి, జైపాల్‌రెడ్డి అభిమానాలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. రేవంత్ అలా మాట్లాడడం జైపాల్‌రెడ్డిని, జానారెడ్డిని కించపరచడమే అవుతుందని, వారి గౌరవాన్ని తగ్గించడమే అవుతుందని మండిపడుతున్నారు. రేవంత్ తనను తాను హీరోగా చూపించుకునేందుకే జైపాల్, జానా లాంటి పెద్ద నేతలను కించపరిచేలా మాట్లాడుతున్నారని ధ్వజమెత్తుతున్నారు. అసలు వాళ్లు ఎందులో తక్కువ? వారిని తక్కువచేసి మాట్లాడడం ఏమిటి? అని నిలదీస్తున్నారు. రేవంత్ ఏదోఒకసారి అలా మాట్లాడితే పొరపాటు అనుకోవచ్చని, కానీ.. పదే పదే అలా మాట్లాడటం కచ్చితంగా వారిని అవమానించడమేనని గుస్సా అవుతున్నారు.

వాళ్లు ఎందులో తక్కువ?

రాజకీయాల్లో జానారెడ్డి, జైపాల్‌రెడ్డిది ప్రత్యేక మైన స్థానం. కాంగ్రెస్ పార్టీలో వారి పాత్ర చాలా కీలకం. ఆ పార్టీ చరిత్రలో వారి పాత్ర ఎనలేనిది. రాజకీయ ఉద్ధండులుగా పేరుపొందిన వారికి ఐదు దశాబ్దాల సుదీర్ఘ రాజకీయ అనుభవం ఉన్నది. రాజకీయ మేధావులుగా పేరు గడించిన ఈ ఇద్దరు నేతల్లో జానారెడ్డి రాష్ట్ర రాజకీయాల్లో కీలక నేతగా ఎదిగితే.. జైపాల్‌రెడ్డి ఏకంగా జాతీయ రాజకీయాల్లోనే చక్రం తిప్పారు. ఏడుసార్లు ఎమ్మెల్యేగా గెలిచిన జానారెడ్డి రాష్ట్రంలో అత్యధికసార్లు ఎమ్మెల్యేగా గెలిచిన వారిలో ముందు వరుసలో నిలిచారు. ఎన్టీఆర్ హయాంలోనే మంత్రిగా చేసిన ఆయన.. ఆ తర్వాత కాంగ్రెస్‌లో చేరి సుదీర్ఘ కాలంపాటు వివిధ కీలక శాఖలకు మంత్రిగా వ్యవహరించారు. జైపాల్‌రెడ్డి రాష్ట్ర రాజకీయాలతోపాటు జాతీయ రాజకీయాల్లోనూ కీలక వ్యక్తిగా పేరుపొందారు. లోక్‌సభ, రాజ్యసభలో సుదీర్ఘ కాలం ప్రాతినిధ్యం వహించిన ఆయన.. రెండుసార్లు కేంద్ర మంత్రిగా వ్యవహరించారు. జైపాల్‌రెడ్డి పనితీరుకు మెచ్చి కేంద్ర ప్రభుత్వం 1998లో ఆయనను అత్యంత ప్రతిష్టాత్మకమైన 'ఉత్తమ పార్లమెంటేరియన్' అవార్డుతో సత్కరించింది. చట్టసభల్లో ఆయన చేసిన ప్రసంగాలకు ఎంతో ప్రాముఖ్యత ఉండేది. ఎంతో గొప్ప రాజకీయ చరిత్రతో ప్రతిపక్షాలను సైతం మెప్పించగలిగిన జానారెడ్డి, జైపాల్‌రెడ్డి తక్కువ స్థాయి వ్యక్తుల్లా రేవంత్‌కు ఎలా కనిపించారని, పలువురు కాంగ్రెస్ నేతలు, కార్యకర్తలు ప్రశ్నిస్తున్నారు.

కాంగ్రెస్‌కు ఎనలేని సేవలు

కాంగ్రెస్‌కు మూడు దశాబ్దాలపాటు ఎనలేని సేవలు అందించిన జానారెడ్డి, జైపాల్‌రెడ్డి ఇటు రాష్ట్రంలో, అటు కేంద్రంలో ఆ పార్టీ అధికారంలోకి రావడంలో కీలక పాత్ర పోషించారు. ఒకానొక సందర్భంలో ఈ ఇద్దరు నేతలు ఆ పార్టీలో రెండో స్థానానికి చేరారు. కాంగ్రెస్ కష్టాల్లో ఉన్నప్పుడు ఈ ఇద్దరు నేతలు అండగా నిలిచి, ఆ పార్టీని నిలబెట్టగలిగారు. కాంగ్రెస్ అధికారాన్ని కోల్పోయినప్పుడు రాజ్యసభలో జైపాల్‌రెడ్డి, ఇక్కడ జానారెడ్డి ప్రతిపక్ష నేతలుగా నిలబడి కొట్లాడారు. వారిని తక్కువ చేసి మాట్లాడటం మానుకోవాలని, లేదంటే తమ పని తాము చేస్తామని కాంగ్రెస్ శ్రేణులు హెచ్చరిస్తున్నాయి. జానారెడ్డి, జైపాల్‌రెడ్డి గురించి మాట్లాడే నైతిక అర్హత రేవంత్‌రెడ్డికి లేదంటూ ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

ఊర్లను ముంచి మల్లన్నసాగర్

మొదటిపేజీ తరువాయి...

మోదీ తాతను తెచ్చుకుంటవో తెచ్చుకో. మూసుకుందాం' అని వ్యాఖ్యానించారు.

నేను జానా, జైపాల్‌ను కాను..

ప్రతిపక్ష నేత కేసీఆర్‌ను నిందించే క్రమంలో కాంగ్రెస్ సీనియర్లపైనా సీఎం రేవంత్ పలు వ్యాఖ్యలు చేశారు. 'నేను జైపాల్‌రెడ్డిని, జానారెడ్డిని కాదు. ఒక్కొక్కరినీ తొక్కుకుంటూ ఇక్కడి దాక వచ్చినం' అని వ్యాఖ్యానించారు. కాంగ్రెస్ కష్టాల్లో ఉన్నప్పుడు ఇందిరమ్మను గెలిపించిన చరిత్ర మెదక్ ప్రజలదని అన్నారు. బీహెచ్‌ఈఎల్, బీడీఎల్, ఇక్రిశాట్ పరిశ్రమలను కాంగ్రెస్ ప్రభుత్వమే తీసుకొచ్చిందని చెప్పారు. దుబ్బాకలో ఓడిపోయిన రఘునందరరావు మెదక్ ఎంపీ ఎలా అవుతారని ప్రశ్నించారు. చేనేత రంగంపై జీఎస్టీ విధించడం ద్వారా పద్మశాలీలను దెబ్బతీశారని, దీంతో చిన్న పరిశ్రమలన్నీ మూతపడ్డాయని విమర్శించారు. పదేండ్లు అధికారంలో ఉన్న బీఆర్ఎస్ మెదక్ ప్రాంతానికి చేసిందేమీ లేదన్నారు.

సాగర్‌పై సర్కారు మొద్దునిద్ర

హైదరాబాద్, ఏప్రిల్ 20 (నమస్తే తెలంగాణ): నాగార్జునసాగర్ డ్యామ్‌పైనే కాదు మొత్తం కృష్ణా జలాలపైనే కాంగ్రెస్ సర్కార్ చేతులెత్తేసిందా? అనే అనుమానం కలుగుతున్నది జరుగుతున్న పరిణామాలను చూస్తుంటే! ఏపీ రాత్రికి రాత్రి కృష్ణా జలాలను ఎలాంటి అనుమతుల్లేకుండా తరలించుకుపోయినా మొద్దునిద్ర పోతున్నది. విషయం బయటకు పొక్కడంతో బోర్డుకు లేఖ రాసి చేతులు దులుపుకొన్నది. నాగార్జునసాగర్‌లో విద్యుత్తు ఉత్పత్తి కోసం వాడిన నీరు దిగువకు పోకుండా నిల్వ చేసేందుకు వీలుగా, డ్యామ్ నుంచి 21 కిలోమీటర్ల వద్ద నల్లగొండ జిల్లా అడవిదేవులపల్లి మండలం చిట్యాల గ్రామం వద్ద కృష్ణానదిపై ఏడు టీఎంసీల నీటినిల్వ సామర్థ్యంతో టెయిల్‌పాండ్ ప్రాజెక్ట్‌ను నిర్మించారు. ఆ నీటిని రివర్స్ టర్బయిన్ల ద్వారా తిరిగి నాగార్జునసాగర్ జలాశయంలోకి పంపిస్తారు. గతంలో ఎన్నడూ నిల్వ చేసిన నీటిని దిగువకు విడుదల చేయలేదు. కానీ, తాజాగా ఏపీ మాత్రం ప్రాజెక్టులో నిల్వ ఉన్న 6.73 టీఎంసీల జలాల్లో నాలుగు టీఎంసీలను రాత్రికి రాత్రి తరలించుకుపోయింది. అది కూడా కేఆర్‌ఎంబీ అనుమతులు లేకుండానే! నీటి తరలింపు ప్రక్రియ మూడు రోజులపాటు కొనసాగినా, తెలంగాణ సర్కారుకు పట్టించుకోలేదు. నాలుగు రోజుల తరువాత మేల్కొని ఏపీ నీటి చౌర్యంపై అప్పటికప్పుడు బోర్డుకు ఫిర్యాదు చేస్తూ ఒక లేఖ రాసి చేతులు దులుపుకున్నది. ఇప్పటికీ గోప్యతను పాటిస్తున్నది. దీనిపై ఇప్పటికీ సంబంధిత శాఖ మంత్రి కానీ, ఇతర ప్రభుత్వ పెద్దలు కానీ స్పందించకపోవడం కృష్ణాజలాలపై సర్కారు ఉదాసీనతకు అద్దం పడుతున్నదనే విమర్శలొస్తున్నాయి.

అది కూడా అనుమతుల్లేకుండానే..

మే నెలాఖరు వరకు ఉమ్మడి ప్రాజెక్టుల నుంచి నీటి విడుదలకు సంబంధించిన అంశంపై కేఆర్ఎంబీ మెంబర్ సెక్రటరీ, తెలంగాణ, ఏపీ ఈఎన్సీలతో కూడిన త్రిసభ్య కమిటీ ఈ నెల 12న సమావేశమైంది. నాగార్జునసాగర్ ఎండీడీఎల్‌ను 510 అడుగుల నుంచి 500 అడుగులకు తగ్గించి మొత్తంగా 17.55 టీఎంసీలు వినియోగానికి అందుబాటులో ఉన్నాయని తేల్చారు. అందులో 3.55 టీఎంసీలను భవిష్యత్తు అవసరాలకు మినహాయించి మిగతా 14 టీఎంసీలను వినియోగించుకోవాలని నిర్ణయించారు. తెలంగాణకు 8.5 టీఎంసీలు, ఏపీకి 5.5 టీఎంసీలు కేటాయించారు. అయితే అప్పటికే ఏపీ 2.5 టీఎంసీలను వినియోగించుకోగా, ఇక మూడు టీఎంసీలనే వినియోగించుకోవాల్సి ఉన్నది. పులిచింతల వద్ద కృష్ణా డెల్టా తాగునీటి అవసరాలకు నాలుగు టీఎంసీలు కావాలని నాటి త్రిసభ్య కమిటీ సమావేశంలో ఏపీ సర్కారు పట్టుబట్టింది. ఆ మేరకు సాగర్ నుంచి విడుదల చేయాలని ప్రతిపాదించింది. కమిటీ నిర్ణయాన్ని ఉల్లంఘించి, త్రిసభ్య కమిటీ సమావేశం మరుసటి రోజునే అంటే 13వ తేదీ నుంచే తన ఆధీనంలో ఉన్న సాగర్ టెయిల్‌పాండ్ నుంచి నాలుగు టీఎంసీలను అక్రమంగా